
# సత్యవాక్కు



**THE WORD OF TRUTH**

క్రైస్తవ మాసపత్రిక

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
**J. C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక **8** | మార్చి **1987** | సంపుటి **7**

# సంపాదకీయము

## బోధకుల ఆర్థిక సహాయము

### *(Support of Preachers)*

పాపములో బడి నశించుచున్న లోకానికి సువార్త ప్రకటన ద్వారా దేవుడు తన వర్తమానాన్ని అందించాలని సంకల్పించాడు. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" యని క్రీస్తు చెప్పాడు (మార్కు 16:15). "వాక్యమును ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణ దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము" అని పౌలు చెప్పాడు (2 తిమో 4:2). మరల "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండినందున, సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్ము వారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" అని అతడు చెప్పాడు (1 కొరింథీ 1:21).

అయితే సువార్త ప్రకటన వెనుక సువార్తికుడున్నాడు. "ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు? ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించు వారి పాదము లెంతో సుందరమైనవి అని వ్రాయబడి యున్నది" అని పౌలు చెప్పాడు (రోమా 10:13-15).

సువార్త ప్రకటింప బడాలి, దాన్ని ప్రకటించడానికి సువార్తికుడొక డుండాలని మనం చూడగలము. అయితే అతడు పంపబడని యెడల ఎట్లు ప్రకటించగలడు? అంటే అతనికి ఆర్థికంగా సహాయం అవసరం అని దీని యర్థం. బోధకునికి ఆర్థిక సహాయం యిచ్చుట తప్పు అని కొందరు భావిస్తారు. మరికొందరు ఆర్థిక సహాయం ఉంటేనే గాని బోధించలేమని భావిస్తారు. ఇక్కడ రెండు విపరీత భావాలున్నాయి. అయితే ఈ రెండు తప్పే.

ఒక విధంగా చూస్తే, క్రైస్తవు లందరు దేవుని వాక్యాన్ని బోధింగాలి, ఉపదేశించాలి. వారు ప్రభువు కొరకు జీవించి మంచి మాదిరి నెలకొల్పాలి. క్రీస్తు ఇట్లు చెప్పాడు: "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి" (మత్త 5:16). మరొక భావంలో, అంటే బహిరంగ కూటాలలో పురుషులు మాత్రమే దేవుని వాక్యాన్ని బోధించాలి. స్త్రీలు మౌనముగా యుండాలని, పురుషుని స్థానాన్ని ఆక్రమించరాదని హెచ్చరించబడింది (1 కొరింథీ 14:34; 1 తిమో 2:11).

పురుషులు ఆర్థిక సహాయ మున్నను లేకపోయినను బోధించవచ్చు. ఏదో ఒక ఉద్యోగం చేసుకొనుచున్నవారు స్థానిక సంఘ బోధకులుగా

అనేక సందర్భాలలో యుండలేరు. అంటే వారు తమ సంపూర్ణ సమయాన్ని సువార్త ప్రకటనకు వినియోగించలేరు. అయినను సెలవు దినాలలో గాని, ప్రతి సాయంకాలము గాని వారు స్థానికంగాను, పలు చోట్లను సువార్త ప్రకటించగలరు. మరికొందరు ఈవిధంగా కొనసాగలేక, సువార్త కొరకు తమ సమయా న్నంతటినీ వినియోగించ గోర్తారు. అంటే వారు సంపూర్ణ ఆర్థిక సహాయాన్ని కోరుచున్నారు. అనేక సందర్భాలలో వారు డబ్బు కొరకు సువార్త ప్రకటన చేయువారు.

అయితే ఒకడు తన సమయాన్నంతటినీ సువార్త కొరకు వినియోగించగలిగి, అతని స్థానిక సంఘు మతనికి ఆర్థిక సహాయం ఇవ్వగలిగే స్థితిలో యుంటే ఆర్థిక సహాయం పొందుట తప్పేమీ కాదు. పరిమిత ఆజ్ఞను జారీచేస్తూ యేసు 70 మంది శిష్యులను పంపినప్పుడు, "పనివాడు తన జీతమునకు పాత్రుడని" చెప్పాడు (లూకా 10:7). పౌలు ఇట్లు యోచించాడు: "కళ్ళము త్రొక్కుచున్న యెద్దు మూతికి చిక్కము పెట్టవద్దు అని మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడి యున్నది. దేవుడు ఎడ్ల కొరకు విచారించుచున్నాడా? కేవలము మన కొరకు దీనిని చెప్పుచున్నాడా? అవును మనకొరకే గదా యీ మాట వ్రాయబడెను? ఏలయనగా దున్నువాడు ఆశతో దున్నవలెను, కళ్ళము త్రొక్కుచువాడు పాటలో పాలు పొందుదును ఆశతో త్రొక్కవలెను. మీ కొరకు ఆత్మ సంబంధమైనవి మేము విత్తి యుండగా మీ వలన శరీర సంబంధమైన ఫలములు కోసికొనుట గొప్ప కార్యమా? ఇతరులకు మీ పైని యీ అధికారములో పాలు కలిగిన యెడల మాకు ఎక్కువ కలదు గదా? అయితే మేము యీ అధికారమును వినియోగించుకొన లేదు; క్రీస్తు సువార్తకు ఏ అభ్యంతరమైనను కలుగజేయకుండుటకై అన్నిటిని సహించుచున్నాము. ఆలయ కృత్యములు జరిగించువారు ఆలయమువలన జీవము చేయుచున్నారనియు,

బలి పీఠమునొద్ద కనిపెట్టుకొని యుండువారు బలిపీఠముతో పాలివారై
యున్నారనియు మీరు ఎరుగరా? ఆలాగున సువార్త ప్రకటించువార
సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించి యున్నాడు. నేనై
వీటిలో దేనినైనను వినియోగించుకొన లేదు; మీరు నా యెడ
యీలాగున జరుపవలెనని ఈ సంగతులు వ్రాయను లేదు, ఎవడైన
నా అతిశయమును నిరర్థకము చేయుటకంటె నాకు మరణమే మేలు. నేన
సువార్త ప్రకటించుచున్నను నాకు అతిశయ కారణము లేదు. సువా
ర్తను ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడి యున్నది
అయ్యో నేను సువార్తను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ
ఇది నేనిష్టపడి చేసిన యెడల నాకు జీతము దొరకును. ఇష్టపడక పోయి
నను గృహనిర్వాహకత్వము నాకు అప్పగింపబడెను. అట్లయితే నా
జీతమేమి? నేను సువార్తను ప్రకటించునప్పుడు సువార్త యందు నా
కున్న అధికారమును పూర్ణముగా వినియోగించుకొనకుండ సువార్తను
ఉచితముగా ప్రకటించుటయే నా జీతము. నేను అందరి విషయమ
స్వతంత్రుడనై యున్నాను ఎక్కువ మందిని సంపాదించుకొనుటకై
అందరికిని నన్ను నేనే నాయకునిగా చేసుకొంటిని" (1 కొరిం
9:9-19).

పై లేఖన భాగములను బట్టి పనివాడు లేక బోధకుడు జీతమ
పుచ్చుకొనుట దేవుని చిత్తానుసారమైనదని గ్రహించగలము. సహో
దరులనుండి పౌలు సహాయము పొందుకొన్న కొన్ని సందర్భాల
ఉన్నవి (ఫిలిప్పీ 4:16). మిగతా సమయాల్లో అతడు డేరాలు కట్ట
కొంటూ జీవించాడు (అపొ.కా. 18:3). అయినను ఏమీ జీతము
పుచ్చుకొనకుండగనే అతడు ఎక్కువ కాలము సువార్త బోధించాడు
లోకమంతా సువార్త వ్యాపించుట కారంభ కాలంలో అతడు జీవిం
చాడు. మరియు అనేక సందర్భాల్లో అతనికి జీతమిచ్చుటకు సంఘము
ఆర్థికంగా శక్తి కలిగి యుండలేదు. ఒకవేళ జీతము పుచ్చుకొనినట్ల

యితే ధనార్జన కొరకు సువార్త ప్రకటించు చున్నాడని శత్రువులు అతనిమీద నింద మోపియుండేవారు.

మన గ్రామాల్లో సంఘము ఇంకా బలపడకుండా యున్నప్పుడు, దాని బోధకులకు సరిపడినంత ఆర్థిక సహాయం ఇయ్యలేకుండినప్పుడు, బోధించుట కాకగలిగిన వారు ఈ పరిస్థితిని అవగాహన చేసికొని, ఏదైనా ఉద్యోగం, వృత్తి లేక వ్యాపారం చేసికొంటూ సువార్త బోధించాలి, లేదా సహోదరులు ఇవ్వగలిగిన దానితో సంతృప్తి జెంది ప్రభువు కొరకు పనిచేస్తూ యుండాలి. అట్లు చేయడంలో సంఘము బలపడి ఒకానొక దినమందు తన పనివారికి సరిపడినంత జీతము ఇయ్యగలిగే స్థితికి చేరుకోగలదు. సంఘము స్వయంపోషక పరిస్థితికి వచ్చులాగున కానుక లిచ్చుటలో స్థానిక సంఘ సభ్యుల బాధ్యతలను వారికి తెలియ జేయాలి.

కొందరు బోధకులు కేవలము జీతగాళ్ళు మాత్రమే. అంటే వారు కేవలం డబ్బుకొరకే బోధిస్తారు, లేక తమ కడుపుకే దాసులు. అయితే అందరు ఇట్టివారుమాత్రం కాదు. జీతగాళ్ళ గుంపు విచారకరమైనది. వారిని తొలగించుట మంచిది. అదే సమయంలో సంఘము సంఖ్యలోను ఆర్థిక స్తోమతలోను పెరుగుచుండగా, సువార్త కొరకు సంపూర్ణ సమయాన్ని వెచ్చించువారికది ఆర్థిక సహాయం తప్పక అందజేయాలి. దీని వలన స్థానిక సంఘము అభివృద్ధి జెందుతాది, పలు ప్రాంతములకు సువార్తికులను పంపగలుగుతాది.

ఆర్థిక సహాయం కొరకు విదేశీ సహోదరుల నార్జించే వారింకా ఉన్నారు. ప్రతి సందర్భములోను యిది తప్పేమీ కాదు గాని యిది అనేక సందర్భాలలో జ్ఞానయుక్తమైనది కాదు. స్థానిక సంఘము స్వాతంత్రము కలిగి అభివృద్ధి జెందుచూ యుండాలంటే (ఈ మాట బోధకులకు కూడ వర్తిస్తాది) వారు తమ పనిని ఆర్థికంగా తామే

పోషించుకోవడం నేర్చుకోవాలి. జీతగాడైన వాడు సహజంగా విదేశీ సహాయం కొరకు ఆకర్షించబడతాడు. అట్టివాడు సంఘాన్ని స్వయం పోషక సంఘముగా చేయలేడు.

గౌరవప్రదమైన రీతిగా తమ పనిని తాము నిర్వహించుకొనే లాగున దేవుడు తన ప్రజలకు సహాయం చేయునుగాక. సంఘము అభి వృద్ధి చెందుచున్నదని అప్పుడు చెప్పుకోవచ్చును.

---

# క్రైస్తవారాధన

## (*Christian Worship*)

ఆరాధన లన్నింటిలోను క్రైస్తవారాధన ప్రాముఖ్యమైనది. క్రైస్తవారాధన అంటే, క్రొత్త నిబంధన గ్రంథములో దేవుడు నిర్దేశించిన ఆరాధన యని నా ఉద్దేశం. దానిని బట్టే క్రైస్తవుడు నేడు దేవుని నారాధించాలి. ఆరాధన అనే ఈ మాట రెండు వందల మారులు పైగా బైబిలులో మనకు కనబడతాది. ప్రతి యుగం లోను దేవుడు మానవునినుండి ఆరాధన కోరాడు. అయితే ఆ యారాధన ఎట్లు చేయాలో అను సంగతి ఆయన మానవునికి వదిలేసేయలేదు; సరిగదా ఆయన కోరు ఆరాధనను గూర్చి దేవుడు వివరాలిచ్చాడు. నేటి మత ప్రపంచాన్ని మనం చూస్తే, మానవులు పలు విధాలుగా దేవుని నారాధించుచున్నారు. అది వారు స్వయంగా కల్పించుకొన్న క్రమం గాని దేవుని మాటలను బట్టి యున్నట్టిది కాదు. అట్టిది స్వేచ్ఛారాధన అవుతాది. అది దేవుని దృష్టిలో వ్యర్థం.

మానవులెట్లు దేవుని నారాధించాలో ఆయన మొదటినుండీ చెబుతూనే వచ్చాడు. ఉదాహరణకు మొదటి కుమారులైన కయీను హేబెలులకు ఆయన నారాధించే విధానాన్ని తెలియ జేసాడు. వీరి

చేసిన ఆరాధనను గూర్చి ఆదికాండము 4:3-5 వచనాల్లో మనం ఇట్లు చదువగలం: "కొంత కాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడ తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను; కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు".

తన సొంత తెలివి నుపయోగించి దేవుని నారాధించాలని ప్రయత్నించిన వానిగ కయీను మనకు కనబడుచున్నాడు. దేవునికి ఏది బడితే దానిని అర్పణగా అర్పించేయొచ్చని అతడు తలంచి యుంటాడు. అయితే దేవుడతని అర్పణను అంగీకరించలేదు. దీనిని బట్టి ఆయన అంగీకరించేది యేమిటో వారికి తెలియజేసాడని మనం గ్రహించుకోవచ్చును. హెబ్రీ 11 : 4లో, "విశ్వాసమునుబట్టి హేబెలు కయీను కంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతి నొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు" అని వ్రాయబడి యుండుట మనము చూడగలము. మరల, రోమా 10 : 17లో చూస్తే దేవుని వాక్యము వినుట ద్వారా విశ్వాసము కలుగునని గ్రహించగలము. హేబెలు దేవుని మాటలను విన్నాడు, కయీను వినడానికి నిరాకరించాడు. దేవుడు హేబెలు అర్పణల నంగీకరించాడు, కయీను అర్పణలను నిరాకరించాడు.

## ఆరాధన తీవ్రమైనది

క్రైస్తవారాధన యనే అతి ప్రాముఖ్యమైన అంశాన్ని మనం ఇప్పుడు గమనించుచున్నాము. ఈ యారాధనలో మనలను నడిపించుటకై మార్గదర్శి, క్రొత్త నిబంధన గ్రంథము ఈయబడి యున్నది

నేడు మనం చేయు ఆరాధనను దేవుడంగీకరించాలంటే మనము ఈ గ్రంథము చెప్పిన ఆరాధించాలి. ఒక సందర్భంలో క్రీస్తు ప్రభువు ఇట్లు చెప్పాడు: "దేవుడు ఆత్మ గనుక ఆయన నారాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4 : 24). మన ఆరాధన అంగీకరింపబడాలంటే అది రెండు ముఖ్యాంశములపై ఆధారపడి యున్నది: అది ఆత్మతో కూడినట్టిదై యుండాలి, సత్యముతో కూడినట్టిదై యుండాలి. నేటి కాలపు ఆరాధన చాలమట్టుకు విలువ లేనిదే; అది దేవుని సత్యముపై ఆధారపడినట్టిది కాదు. ఆరాధన తీవ్రమైన సంగతి, దానిని మనం తీవ్రంగానే పరిగణించాలి. ఆరాధనలో మనం నిద్రపోయినా, నవ్వుతూ, కబుర్లాడుకొంటూ కాలం గడుపుచున్నా, పరలోకమందున్న దేవుని మాత్రం ఆరాధించడం లేదు!

ప్రపంచంలో నేడు విగ్రహారాధన ఎక్కువ యున్నది. కొందరికి తమ వినోదమే ఒక విగ్రహం, వారీ లేఖనాన్ని ధ్యానించాలి: "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో యుండదు. లోకములో ఉన్నదంతయు అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే లోకమును దాని ఆశయు గతించి పోవుచున్నవిగాని, దేవుని చిత్తమున జరిగించువాడు నిరంతరమును నిలుచును" (I యోహా 2 : 15-17) కొందరు ఫేషన్లను ఆరాధిస్తారు. అయితే "ఈలోకపు నటన గతించుచున్నది" యని లేఖనము చెప్పుచున్నది (I కొరి 7 : 31). మ కొందరు ధనాన్ని ఆరాధిస్తారు. యేసు ఇట్లనుచున్నాడు: "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా యుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుం

నేరరు" (మత్త 6 : 24). మీరు ఫలానా సంగతి చేయ నేరరని యేసు క్రీస్తు చెప్పుచున్నప్పుడు, దాన్ని చేయకుండుట శ్రేష్టం.

ఆరాధనను గూర్చి చెప్పుకొనుచున్నప్పుడు, అనేకులనుద్దేశించి యేసు చెప్పిన ఈ మాటలను చెప్పుకోకుండ యుండలేము: "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశ ములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్త 15 : 9). యిలా ఆరాధించే వారు ఈనాడు ఎంతమంది లేరు ?

## ఆదిమ క్రైస్తవుల ఆరాధన

లేఖనములలో వ్రాయబడిన రీతిగా మనం ఆరాధించకపోతే మన ఆరాధన వ్యర్థం. ఆరాధించినప్పుడు ఆదిమ క్రైస్తవులు ఏమి చేసారు ? ఆరాధించేటప్పుడు క్రైస్తవులు నేడు ఏమి చేస్తారు ? అంగీకార యోగ్యమైన ఆరాధనకు ఆదిమ క్రైస్తవులు ఏమి చేసారో, దాన్నే మనము కూడ చేయాలి. ఈ సంగతిని ఆలోచించడం మనకు శ్రేయస్కరం. వారి ఆరాధనాంశములను ఇక్కడ మనం చెప్పుకోవడం మంచిదే.

క్రైస్తవులు పాటలు పాడాలని క్రొత్త నిబంధన బోధించు చున్నది (1 కొరి 14 : 15; ఎఫెసీ 5 : 19; కొల 3 : 16; రోమా 15 : 9). ఆదిమ క్రైస్తవులు ఆపని చేసారు. యిది ఆరాధన, క్రైస్త వులు ఆరాధనలో వాద్యములు వాయించాలని క్రొత్త నిబంధన బోధించుటలేదు. ఆరాధనలో వాద్యములు వాయించువారికి క్రొత్త నిబంధనలో దొరికే రుజువు యేమీ లేదు. అది కేవలము మనుష్యుల సిద్ధాంతము మాత్రమే. అట్టిది వ్యర్థారాధన.

క్రైస్తవులు ప్రార్థన చేయాలని క్రొత్తనిబంధన బోధించు చున్నది (లూకా 18 : 1; I కొరి 14 : 15; I థెస్స 5 : 17). ఆదిమ

క్రైస్తవులు దీనిని చేసారు. యిది క్రైస్తవారాధన. తన ప్రజలు ఆత్మతోను మనస్సుతోను ప్రార్థించునట్లు దేవుడు సహాయం చేయునుగాక.

తాము అభివృద్ధి జెందిన కొలది క్రైస్తవులు కానుకలు యివ్వాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది ( I కొరి 16:1,2; 2 కొరి 8:7). ఆదిమ క్రైస్తవులు దీనిని చేసారు. యిది క్రైస్తవారాధన. క్రొత్త నిబంధన కృషికి ఈ విధంగా గాక వేరే విధముగా ధనాన్ని ఆర్జించడం ఆరాధన కాదు. అది పాపం.

ప్రభువు దినమందు క్రైస్తవులు ప్రభువురాత్రి భోజనములో పాలు పొందాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది (అపో.కా. 20:7). ఆదిమ క్రైస్తవులట్లు చేసారు. అది క్రైస్తవారాధన. ఆదివారమున గాక వేరే దినమున గాని, వారానికొకసారి గాక మరింకెప్పుడైనా గాని ప్రభువురాత్రి భోజనము నాచరించుట వ్రాయబడిన రీతిగా ఆరాధించుట కాదు.

దేవుని వాక్యాన్ని బోధించాలని ఉపదేశించాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది. ఆదిమ క్రైస్తవులట్లు చేశారు. నిజానికి "వారు అపొస్తలుల బోధ యందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన యందును ఎడతెగక యుండిరి" యని దైవ రికార్డు చెప్పుచున్నది (అపో.కా. 2 : 42). యిది క్రైస్తవారాధన. దీనినుండి తప్పిపోయినప్పుడు మనము అపొస్తలుల బోధ నుండి తప్పిపోవుదుము. అంతేకాదు పరలోకాన్ని కూడ తప్పిపోవుదుము.

—ఫ్రెడ్ E. డెన్నిస్

---

గమనిక : మీ అడ్రసులో మార్పు వచ్చినపుడు, లేదా మీరు M.O. పంపునప్పుడు మీ సత్యవాక్కు నంబరు తెలియ జేయండి. యిది అత్యవసరం.

# క్రీస్తు వారి రెండవ రాకడ

( గత సంచిక తరువాయి )

— విక్టర్ డి. తురాక, తెనాలి

"వెస్మేయండ్ల పరిపాలన" వారు చెప్పుచున్న మూడు సూత్రములు కలవు : వాటిని పరిశీలింతము :

(i) మహాశ్రమ కాలము (Tribulation)
(ii) సంఘము ఎత్తబడుట (Rapture)
(iii) అసలయిన రెండవ రాకడ (Second Coming Proper)

(i) మహాశ్రమల కాలము : రెండవ రాకడ మొదటి దశలో ప్రభువు ఆకాశమండలములో మేఘముల మీదికి వచ్చినప్పుడు, పరిశుద్ధులందరు పైకి ఎత్తబడి అచటనేయుందురు. అప్పుడు భూమి మీద గొప్పశ్రమలు కలుగును. మత్తయి 24 : 21లో చెప్పబడినది ఈ శ్రమలను గూర్చియే యని వారందురు.

అది కాదని మనము అనుచున్నాము, ఎందుకనగా, అదే అధ్యాయములో 16వ వచనములో (మత్తయి 24 : 16) విశ్వాసులనందరిని కొండలకు పారి పొమ్మని ప్రభువు చెప్పుచున్నారు. మరి, విశ్వాసు లందరు పైకి ఎత్తబడితే కొండలకు పారి పోవలసిన దెవరు ! మరియు - 20వ వచనములో, విశ్వాసులందరు ప్రార్థించవలసినదిగా కోరబడిరి. ఆ శ్రమలు చలికాలములోగాని, విశ్రాంతి దినమునగాని రాకుండునట్లు ఎందుకనగా విశ్రాంతి దినములలో యెరూషలేము ద్వారములు మూయుదురు. పారిపోవుటకు వీలుండదు. చలికాలమున కొండలలో చలికి చంటిబిడ్డలు చనిపోవుదురు.

(ii) పరిశుద్ధులు ఎత్తబడుట : దీని విషయమై పత్రికలలో రెండు చోట్ల పరిశీలించవలెను .

మొదటిది - I థెస్స 4 : 14-17 నందు "... ... ఆ మీదట సజీవులమై నిలచియుండు మనము వారితో గూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపో బడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడా వుందుము."

రెండవది - యూదా 1 : 14-15. "ఆదాము మొదలుకొని ... ఇదిగో అందరికిని తీర్పు తీర్చుటకును ... ... భక్తిహీనులైన పాపులు తనకు విరోధముగా చెప్పిన కఠినమాట లన్నింటిని గూర్చి వారిని ఒప్పించుటకును ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను."

పై వాక్యములను చక్కగా పరిశీలించినచో - ప్రభువు రెండవ రాకడలో మొదటి దశ రెండవదశ వున్నటుల కనిపించదు. ఒక వేళ యూదా పత్రికలో చెప్పబడిన రాకడ, 'రాకడలోని రెండవ దశ' అయిన ఎడల - "అందరికి తీర్పు తీర్చుటకును, వారిలో భక్తిహీను లందరును..." అని వున్నది గనుక, వెయ్యేండ్ల పరిపాలనకు ముందు గానే భక్తిహీనులకు తీర్పు తీర్చబడినట్లు కదా ? ఆ తీర్పు - వారి సూత్రమునకు విరుద్ధముగా, వెయ్యి సంవత్సరములు ముందుగా జరిగి నట్లు కదా! వారి సిద్ధాంతము ప్రకారము, 'వెయ్యేండ్ల పాలన' ముగియు వరకు భక్తిహీనులైన 'కడమమృతులు' బ్రతుకరుగదా ! గనుక వారి సిద్ధాంత ప్రకారము చూచిన ఎడల ప్రభువు రెండవ రాకడలో - మూడుసార్లు వచ్చుట జరుగవలెను.

ఒకసారి పరిశుద్ధులకొరకు;

రెండవసారి పరిశుద్ధులతోను;

మూడవసారి భక్తిహీనులకు తీర్పుతీర్చుటకు రావలసియుండును. ప్రభువు యిన్నిసార్లు వచ్చుట జరుగునా ? 1 థెస్స 4 : 16 లో "... క్రీస్తు నందుండి మృతులైనవారు మొదట లేతురు" అని వున్నది.

ప్రభువు వచ్చినప్పుడు మరణించిన తమ ప్రియులు సమాధులలోనే విడిచిపెట్టబడి, బ్రతికి యున్నవారే ప్రభువును ఎదుర్కొనుటకు వెళ్ళుదురనే అభిప్రాయము థెస్సలోనికయుల కున్నందున, వారిని దుఃఖపడకుండ చేయుటకు పౌలు చెప్పిన ఆదరణ వాక్యములే అవి. "సజీవులమై నిలచియుండు మనము క్రీస్తును ఎదుర్కొనుటకు వెళ్ళక ముందే మన మృతులైన ప్రియులు లేతురు" అను అర్థముతో - "వారు మొదట లేతురు" అనెను. అంతేగాని – పరిశుద్ధులు మొదట లేతురు, రెండవసారి భక్తి హీనులు లేతురు అని కాదు. II థెస్స 1:5-10 లో, క్రీస్తువారు వచ్చినప్పుడే భక్తిహీనులకు కూడా తీర్పు జరుగుట చూడ గలము. గనుక పరిశుద్ధులు ముందుగా ఎత్తబడుట ఒకసారి, భక్తి హీనులకు తీర్పు తీర్చుటకు రెండవసారి వచ్చుట అనునవి లేవు.

ద్వివిధ రెండవరాకడ **(dual Coming theory) :**

కొత్త నిబంధనను శ్రద్ధగా పరిశీలించినచో, ప్రభువు రెండవరాకడ ద్వి విధముగా ఎచ్చటను కానరాదు. 'వెయేండ్లపాలన వారు' ఈ ద్వి విధములు ఋజువు చేయుటకు రెండు పదములపై ఆధారపడు చున్నారు.

ఒకటి - **'Parousia'** 'సన్నిధి' లేక 'ఆగమనము'

రెండవది - **'Epiphaneia'** 'ప్రత్యక్షత'

ప్రభువు తన పరిశుద్ధుల కొరకు మేఘముల పైకి వచ్చినప్పుడు అది 'Parousia' సన్నిధి అనియు; ప్రభువు తన పరిశుద్ధులతో మరల భూమి మీదికి వచ్చునప్పుడు అది 'Epiphaneia' 'ప్రత్యక్షత' అనియు ఈ రెండు సంగతుల మధ్యకాలము, ఏడు సంవత్సరములు ఉండుననియు, ఈ కాలముననే 'Rapture' "ఎత్తబడుకాలము" అనియు, ఆ సమయములో భూమి మీద మహాశ్రమలు వుండుననియు వాదించుచున్నారు. వచ్చిన చిక్కేమిటంటే అది నిజముకాదు. క్రొత్త నిబంధనంతటిలో అటువంటి అర్థములో ఆ రెండు పదములు వాడబడ

లేదు. తర్జుమా దారులు కూడా వాటిని ఆ అర్ధములో తర్జుమా చేయ లేదు. ఆ రెండు మాటలను 'రాకడ' అను అర్ధముతోనే తర్జుమా చేసిరి. దీనికి ఋజువుగా :-

(a) II థెస్స 2:8 "... ప్రభువైన యేసు తన నోటి యూపిరి చేత వారిని సంహరించి తన ఆగమన ప్రకాశముచేత నాశనము చేయును." ఇచట 'ఆగమన' మనునది Parousia గాను, "ప్రకాశము" Epiphaneia గాను వాడిరి. ఒకే వాక్యములో రెండు మాటలు వాడిరి. అనగా ఈ వాక్యమును ఈ విధముగా చదువవచ్చును. "తన Parousia, అప్పుడు, తన Epiphaneia తో నాశనము చేయును." గనుక దీనినిబట్టి Parousia కు Epiphaneia కు మధ్య ఏ విధమైన కాలవ్యవధి లేదని తెలియుచున్నది. గాని వారు చెప్పు చున్నట్లు 7 సం॥లు మిాకేమైన కనబడుచున్నవా ?

(b) I థెస్స 3:12. "మరియు మన ప్రభువైన యేసు తన పరిశుద్ధు లందరితో వచ్చినప్పుడు"— ఈ వాక్యములో 'వచ్చినప్పుడు' అను మాటకు 'Parousia' వాడబడినది. కాని 'వారి' సిద్ధాంతము ప్రకారము, పరిశుద్ధులతో వచ్చుట- Epiphaneiaలో జరుగవలెను గదా! మరి వారి జవాబు ఏమిటి ?

(c) I థెస్స 4:14. "యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మిన ఎడల, అదే ప్రకారము, యేసునందు నిద్రించిన వారిని దేవు డాయనతో కూడ వెంట బెట్టుకొని వచ్చును." ఈ వాక్యములో "యేసునందు నిద్రించిన వారిని" ఆయనతో కూడ "వెంట బెట్టుకొని వచ్చునని" ఉన్నది కదా; మరి 'వారి' సిద్ధాంతము ప్రకారము - అప్పుడు - యేసు తన పరిశుద్ధుల కొరకు కదా రావలసినది. యిప్పుడు ఏమి జరిగినది ? ఆయన తనయందు నిద్రించిన "పరిశుద్ధులను వెంట బెట్టుకొని" "పరిశుద్ధులకొరకు వచ్చినట్లా" ?

(d) II తిమోతి 4:8. "ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడి యున్నది. ఆ దినమున నీతి గల న్యాయాధిపతియైన ప్రభువు, అది నాకును, నాకు మాత్రమే కాకుండా తన "ప్రత్యక్షత"ను అపేక్షించు వారందరికిని అనుగ్రహించును". ఈ వాక్యములో అపొస్తలుడైన పౌలు చెప్పినదేమనగా - ప్రభువు యొక్క "ప్రత్యక్షత" దినమందు తనకు నీతి కిరీట మివ్వబడునని -Epiphaneia నాడు పౌలు నీతికిరీటము పొందుచున్నాడు గాని "వారి" సిద్ధాంత ప్రకారము ఆరోజున జరుగగూడదే!

గనుక - "వెయ్యేండ్ల పాలన" వారు చెప్పుచున్న - తన పరిశుద్ధులకొరకు వచ్చునది 'Paronsia' 'సన్నిధిరాకడని'యు తరువాత ఏడు సంవత్సరములకు మరల తన పరిశుద్ధులతో వచ్చుట "ప్రత్యక్షరాకడ" Epiphaneia అను సిద్ధాంతము తప్పు అని పౌలు, I థెస్స 3:13లో ప్రభువు తన పరిశుద్ధులతో వచ్చునదే "Parousia" అని తెలియజేయుచుండగా - మనము "వెయ్యేండ్లపాలన" వారి మాట నమ్మిన ఎడల, దేవుని వాక్యమును త్రోసివేసినట్లేగదా ?

(B) ప్రభువు మరల వచ్చుదినమే అంత్యదినము :

I కొరింథి 1 : 7-8 "గనుక ఏ కృపావరమునందును లోపములేక మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు ప్రత్యక్షతకొరకు ఎదురు చూచుచున్నారు. మన ప్రభువైన యేసు క్రీస్తు దినమందు మీరు నిరపరాధులై యుండునట్లు అంతమువరకు ఆయన మిమ్మును స్థిరపరచును." ఈ వాక్యములో చెప్పబడిన అంతము - యేసు క్రీస్తు వారు ప్రత్యక్షమైనప్పుడే అని తెలియుచున్నది.

II థెస్స 1:6-10 "ప్రభువైన యేసు తన ప్రభావమును కనబరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమ పరచువారికి

శ్రమయు శ్రమపొందుచున్న మీకు, మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధుల యందు మహిమ పరచబడుటకును, విశ్వసించిన వారందరియందు ప్రశంసింపబడుటకును ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సము ఖము నుండి పారద్రోలబడి నిత్యనాశన మను దండన పొందుదురు." ఈ వాక్యములలో ప్రభువైన యేసు పరలోకము నుండి ప్రత్యక్ష మైనపుడు జరుగు సంగతులు :

(i) మిమ్మును శ్రమపరచు వారికి శ్రమ-Tribulation- దుష్టులకు

(ii) శ్రమ పొందుచున్న మీకు విశ్రాంతి- Rest - నీతిమంతులకు

(iii) దేవుని ఎరుగని వారికిని - ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికి ప్రతిదండన. (Vengence)

(iv) అవిధేయులు ఆయన మహిమ నుండి పారద్రోలబడి నిత్య నాశనమను ప్రతిదండన పొందుదురు.

(v) యోగ్యులని ఎంచబడిన వారికి తన మహిమను బహిర్గ రించును.

పై వాక్యముల వలన - దుష్టులను దండించుట నీతిమంతులకు బహూకరించుట, ఒకే దినమున జరుగునట్లు తెలియుచున్నది. Rap ture దినమందే ఆ విధముగా జరిగితే - మరి "వెయ్యేండ్ల పాలన వారి ప్రకారము, దుష్టుల తీర్పు వెయ్యి సంవత్సరములు ముందుగా జరిగినట్లు గదా! లేదా వారి Rapture వెయ్యేండ్లు ఆలస్యముగా జరిగినట్లా! గనుక పౌలు చెప్పిన 1 కొరింధి 1:7-8, 2 థెస్స 1:6-1 వాక్యముల ప్రకారము రెండవ రాకడ రెండు దశలుగా జరుగుటగాని, నీతిమంతుల పునరుత్థానము, దుష్టుల పునరుత్థానము వేరు వేరుగా జరుగుట గాని వాటి మధ్య కాలభేదము Rapture కొరకు లేనేలేద స్పష్టమగుచున్నది.

(సశేషము)

# సువార్త సత్యములు

## (*The Facts of the Gospel*)

యేసుక్రీస్తు చనిపోయి, సమాధి చేయబడి, సమాధి నుండి పునరుత్థానుడాయెనని లేఖనములు విపులముగా బోధించుచున్నవి. యేసు చరిత్రలోని ఈ సంఘటనలు సువార్త సత్యములుగా సూచింపబడుచున్నవి. కొరింథీ సహోదరులకు వ్రాయుచూ పౌలు ఈ సంఘటనలలో ప్రతిదానిని రక్షణ సత్యములకు వాటికి గల సంబంధమును చూపించెను. "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దాని యందే నిలిచి యున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశ రూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు. నా కియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని, అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి నొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ 15 : 1-4). అనగా క్రీస్తు సువార్త ఈ సత్యములపై ఆధారపడి యున్నది. క్రీస్తు చనిపోక, పాతిపెట్టబడక, సమాధి నుండి పునరుత్థానుడు కాకపోయిన యెడల సువార్త లేకపోయెడిది, అందుచే రక్షణ లేకపోయెడిది. కాని ఆయన చనిపోయి, పాతిపెట్టబడి, పునరుత్థానుడగుటవలన సువార్తకు పునాది కలిగినది. అందుచే అది లోకమును మార్చివేసినది.

ఇప్పుడు మనము సువార్త సత్యములను ఒకదాని తరువాత యొకటి ఆలోచించి నీకు నాకు ఏమి భద్రపరచబడి యున్నవో చూచెదము.

## 1. క్రీస్తుయొక్క మరణము:

క్రీస్తు మరణించెనని బైబిలు గ్రంథము పదే పదే చెప్పుచున్న
కాని దేవుని వాక్యమును వినుము: "క్రీస్తు యేసునకు కలిగిన యి
మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగి
వాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టకూడ
భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి
దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెన
మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణవ
పొందునంతగా, అనగా సిలువ మరణము పొందు నంతగా విధేయ
చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:5-8). "దేవ
కృపవలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవిం
నట్లు, దూతలకంటె కొంచము తక్కువ వాడుగా చేయబడిన యే
మరణము పొందినందున, మహిమా ప్రభావములతో కిరీటము ధరించి
వానిగా ఆయనను చూచుచున్నాము" (హెబ్రీ 2 : 9).

క్రీస్తు ఎవరికొరకై మరణించెను? హెబ్రీ 2 : 9లో వ్రా
బడినట్లు ఆయన ప్రతి మానవుని కొరకు మరణించెను. లేఖనము
కూడా ఆయన పాపులకొరకు మరణించెనని చెప్పుచున్నవి. "అయి
దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా
మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను
(రోమా 5:8). కాని ఆయన పాపులకొరకు ఏల చనిపోవలెను
రక్షణ, నిరీక్షణ కలిగించుటకు: "ఆయన, మనుష్యులందరు రక్షణ
పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని
యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2 : 4). "కొందరు ఆలస్యమని
యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమునుగూర్చి ఆలస్యము చేయు
వాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు

మారు మనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము
గలవాడై యున్నాడు" (2 పేతురు 3 : 9).

అనగా నీ కొరకు, నా కొరకు ఒకరు మరణించిరి. ఈ సంగతి
ఆలోచించుము. మనము పాపులమై, దేవునికి విరోధులమై, కృపకును,
దయకును అర్హులము కాకపోయినప్పటికిని, క్రీస్తు పరలోకమును విడచి
పాపముతోను, దుఃఖముతోను కూడియున్న ఈ భూమిపైకి వచ్చి
మనము రక్షింపబడి నిత్యజీవపు నిరీక్షణ పొందు నిమిత్తము శిలువపై
మరణము పొందుటకు సంసిద్ధుడాయెను (రోమా 5:6,7). ఎంత ఆశ్చ
ర్యము! ఆయన ఆ విధముగనే లోకమంతటి కొరకు—నిన్న, ఈ రోజు,
రేపు—మరణించెనని గ్రహించుము. మన మెంత కృతజ్ఞులమై యుండ
వలెను! అది ఆయన యెడల మన విధేయతను, విశ్వాసమును కలుగ
జేయవలెను. అంతకన్న తక్కువగా ఏమి చేయ సాహసించగలము?

క్రీస్తు సమాధి:

క్రీస్తు సిలువపై మరణించిన తర్వాత లేఖనమిట్లున్నది: "యేసు
శిష్యుడుగా నున్న అరిమతయి యోసేపు అను ఒక ధనవంతుడు
సాయంకాలమైనప్పుడు వచ్చి పిలాతు నొద్దకు వెళ్ళి, యేసు దేహ
మును తన కిమ్మని అడుగగా, పిలాతు దానిని అతని కప్పగింప నాజ్ఞా
పించెను. యోసేపు ఆ దేహమును తీసికొని శుభ్రమైన నారబట్టతో
చుట్టి తాను రాతిలో తొలిపించుకొనిన క్రొత్త సమాధిలో దానిని
ఉంచి, సమాధి ద్వారమునకు పెద్ద రాయి పొర్లించి వెళ్ళిపోయెను.
మగ్దలేనే మరియయు వేరొక మరియయు, అక్కడనే సమాధికి ఎదు
రుగా కూర్చుండి యుండిరి" (మత్తయి 27 : 57-61).

ఇప్పుడు ప్రభువు యొక్క సమాధి ఆ కాలపు ఆచారముల
ప్రకారము వేరుగా గాని అసాధారణముగా గాని లేదు. ప్రతి దినము
మనుష్యులు చనిపోయి పాతిపెట్టబడుదురు. ఇది ఈ భూలోకమంతటను

యున్నది. సృష్టి ప్రారంభమునుండి యున్నది. కాని ఆయన చనిపోయి పాతిపెట్టబడిన తరువాత తిరిగి లేచెదనని ప్రభువు వాగ్దానము చేసి యున్నాడు. ఆయన ఇట్లు పలికెను: "ఈ దేవాలయమును పడ గొట్టుడి. మూడు దినములలో దానిని లేపుదునని వారితో చెప్పెను" (యోహాను 2:19). వారు ఆయనను అర్థము చేసుకొనలేదు. వారు గ్రహించిన మొదల విశ్వసించెడివారా! ఆయన మరణము, సమాధి తరువాత ఏమి జరిగినది? శిష్యులందరు సమస్తమును నశించిపోయె ననెడి ఒక నిస్పృహలో వారు చకితులై యుండిరి. అప్పుడు ఏమి జరి గెను! యేసు తన వాగ్దాన ప్రకారముగా వారి మధ్యకు వచ్చెను.

## 3. క్రీస్తు యొక్క పునరుత్థానము:

క్రీస్తు సిలువపై మరణించి సమాధిలోనే యుండిపోయినట్లయిన లోకము ఆయనను మరచిపోయెడిది, ఒక మోసగానిగా మాత్రము జ్ఞాపకము చేయబడెడివాడు. ఆయన మరణించి సమాధిలోనే యుండి పోయినట్లయిన గతించిన వారివలెనే ఆయన లేకుండా పోయెడివాడు. కాని యేసు వేరే విధముగా యుండెను. ఆయన దేవుని కుమారుడు. ఆయన సమాధినుండి లేచెదనని చెప్పియున్నాడు. అట్లే లేచియున్నాడు (మత్తయి 28). ఆయన పునరుత్థాన ఫలితముగా రక్షణ పునరుత్థాన మున్నదనే నిశ్చిత, నిత్యజీవితము కొరకైన నిరీక్షణ కలిగెను.

ముందుకు వెళ్లుటకు పూర్వము ప్రభువుయొక్క పునరుత్థాన సంబంధమైన లేఖనములను గమనించుదము. "మృతులలోనుండి పున రుత్థానుడై నందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను" (రోమా 1:4). "ఏ విధముచేతనైననను మృతులలో నుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణ విషయములో సమానానుభవము కలవాడనై, ఆయనను

ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును" (ఫిలిప్పీ 3 : 10). "మృతులలో నుండి యేసు క్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు అనగా అక్షయమైనదియు, నిర్మల మైనదియు, వాడబారనదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు, ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింప జేసెను" (1 పేతు 1:3). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతు 3 : 21). "మృతులలో నుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు, మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి, ఆయనతో కూడా జీవించుదుమని నమ్ముచున్నాము" (రోమా 6 : 9). "తాను మృతులకును, సజీవులకును ప్రభువై యుండుటకు ఇందు నిమిత్తమేగదా క్రీస్తు చనిపోయి మరల బ్రదికెను" (రోమా 14 : 9).

క్రీస్తు చనిపోయి, పాతిపెట్టబడి, సమాధిలో నుండి పునరుత్థానుడగుట వలన ఆయన మనకు ప్రభువును, రక్షకుడును ఆయెను. ఆయన దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి, (అ.కా. 2), తిరిగి వత్తునని వాగ్దానము చేసెను (యోహాను 14 : 23).

క్రీస్తు మరణములో ఆయన రక్తము, మనుష్యులు పాపక్షమాపణ పొందు నిమిత్తము చిందించబడెను (మత్తయి 26 : 28, ఎఫెసీ 1:7). క్రీస్తు సువార్తను అంగీకరించుట ద్వారా క్రీస్తు రక్తముతో సాంగత్యము పొంది ఒకని పాపములను తుడుచుకొనుటకు లేక పరిహారము చేసుకొనుటకు వీలగును (అ.కా. 2 : 38; 22 : 16). రాబోవు పాఠములలో ఈ విషయము మరి విపులముగా పరిశీలింతము.

ప్రభుని పునరుత్థాన మూలముగా మనము జీవించుచున్నామని

ప్రతి యొక్క రూపాంతరము కొనవలెను. ఆయనకు విధేయులమై వెంబడించిన యెడల, మనము కూడా జీవించి యుగయుగములు నిత్య జీవములో ఆయనతో పాలివారమై యుందుము.

—జె. సి. ఫోట్.

---

## దేవుని సర్వశక్తి

## (The Omnipotence of God)

(గత సంచిక తరువాయి)

జిమ్. ఓ. కానర్

దేవుని అమిత శక్తికి పరిమితులున్నాయి. సర్వశక్తిని గూర్చి కొందరు అపహాస్యము చేస్తారు. ఉదాహరణకు "తాను మోయజాలనంత పెద్ద బండను దేవుడు చేయగలడా ?" యనే ప్రశ్నను ఎన్నిసార్లు మనం వినలేదు ? ఇదొక అసంభవము, ఆ ప్రశ్న నడిగినవారి తెలివిని లేదా నిష్కాపటాన్ని అది బయలు పరుచుచున్నది. "దేనినైనా ఒకేసమయమందు ఉండుటకు, లేదా లేకుండుటకు దేవుడు చేయలేడు" (Harvey Everest, p. 143). యివి ప్రకృతి వైరుధ్యాలు; ఒకటి మరొకదాన్ని లేకుండా చేస్తాది. దానిని నమ్మవా? ఒకే సమయమందు తలుపును మూయడానికి తెరవడానికి ప్రయత్నించి చూడు ! అసంభవమైన దాన్ని గూర్చిన చర్చ యిక చాలును. గనుక కొన్ని విషయాల్లో దేవుడు ఎట్లు పరిమితం చేయబడ్డాడో గమనింతము.

దేవుడు తన తత్వాన్ని బట్టి పరిమితం చేయబడ్డాడు. నీతిగల దేవుని మనం సేవించుచున్నాము. దుర్నీతిని చేయడం ఆయనకు అసాధ్యం. దేవుడు అబద్ధమాడజాలడని పౌలు సరిగనే వివరించాడు (తీతు 1 : 2). అట్లు చేయడం ఆయన తత్వం కాదు. దేవుడు అబద్ధ

కూడనేరడని హెబ్రీ 6 : 18లో కూడ వ్రాయబడి యున్నది. "యెహోవా న్యాయ విధులు సత్యమైనవి, అవి కేవలము న్యాయ మైనవి" (కీర్త 19:9). దేవుడు చాల జ్ఞానవంతుడు చాల మంచివాడు గనుక పొరబాటు చేయడు, చెడుగు జరిగించడు.

మానవుడు దేవుని పరిమితం చేస్తాడు. ఎంచుకొనే శక్తిని ఆయన మన కిచ్చాడు. ఈ ఎంపిక శక్తిని భంగపరచకుండునట్లు మనతో ఏకీభవించి పనిచేయుటకు ఆయన తన్ను తాను పరిమితం చేసుకొన్నాడు. దీనిని కేల్విన్ సిద్ధాంతము మన్నించదు, గాని నేను మన్నిస్తాను; ఏలయనగా బైబిలు బోధించే బోధ అది. అందువలననే ఇశ్రాయేలీయులను గూర్చి చెప్పునప్పుడు కీర్తనల గ్రంథకర్త ఇట్లు చెప్పాడు: "మాటి మాటికి వారు దేవుని శోధించిరి మాటి మాటికి ఇశ్రాయేలు పరిశుద్ధ దేవునికి సంతాపము కలిగించిరి" (కీర్త 78:41). వారు వాగ్దాన దేశములోనికి ప్రవేశించాలని దేవుడు ఉద్దేశించాడు గాని వారి తిరుగుబాటు వలన ఆ ఉద్దేశాన్ని జరిగించుటలో పరిమితం చేయబడ్డాడు. అదే సంగతి ఈ నాడు కూడ సహజంగా జరుగు చున్నది. అందరు రక్షింపబడాలని ఆయన కోరుచున్నాడు (2 తిమో 2:4), గాని అందరు సువార్తకు విధేయులు కారు గనుక అందరు రక్షింపబడరు. మానవుని అవిధేయత అజ్ఞానముల వలన దేవుడు మన యెడల చేయ తలపెట్టినవన్నీ చేయకుండా పరిమితం చేయబడుచున్నాడని నా నమ్మకము. ఆయన నుండి విస్తారమైన దీవెనలను పొందు నిమిత్తము సర్వ శక్తిమంతుడైన దేవునితో సహకరించుట మనకు జ్ఞాన దాయకము కాగలదు.

మనము "సేవించుచున్న దేవుడు సమర్థుడు" అని షద్రకు, మేషాకు, అబేద్నెగోలతో కలసి ఉద్ఘాటిద్దాం. మరియు "మనలో కార్యసాధకమైన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటి కంటెను,

ఊహించు వాటన్నిటి కంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవుడని" ఎరిగి సంతోషిద్దాం (ఎఫెసీ 3:20). ఆయన శక్తిని బట్టి మనము ఆశ్చర్యపడి ఆయన కృపా కనికరములను బట్టి ఆయనను కీర్తింతము.

(సమాప్తము)

---

## యెహోవాకు అసహ్యములైనవి
## *(Things the Lord Hates)*

— కవిత గూటం

"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు, ఏడును ఆయనకు హేయములు. అవేవనగా అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" అని సొలొమోను చెప్పాడు (సామె 6:16-19).

**అహంకార దృష్టి :** ఈ జాబితాలో అహంకారదృష్టి మొదట యుంచబడింది. దేవుని చట్టముపై తిరుగుబాటుకు, సమస్త అవిధేయతకు అది మూలకారణము. వినయానికి అది వ్యతిరేకమైనది. యేసుప్రభువు మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా తన్నుతాను తగ్గించుకొనెనని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 2 : 5-8). పౌలు గొప్ప అపొస్తలుడైనను, "నేను అపొస్తలులందరిలో తక్కువవాడనని" తనను గూర్చి చెప్పుకొన్నాడు (1 కొరింథి 15:9). యూదా రాజులలో పదియవవాడు ఉజ్జియా. ప్రభువు దృష్టికి అతడు యోగ్యముగా పనిచేసినంతకాలము, ప్రభువతనికి తోడైయుండి, అతనికి సహాయము చేసాడు, మరియు అతడు అభివృద్ధి జెందాడు. అయితే ఉజ్జియ

బలవంతుడై బహుగా అభివృద్ధి జెందినప్పుడు అతడు గర్విష్ఠుడై దేవుని బంగారు బలిపీఠము యొద్ద ప్రధాన యాజకుడు మాత్రమే చేయదగిన ధూపార్పణ చేయనెంచాడు. అక్కడే దేవుడతని మొత్తగా అతడు కుష్ఠరోగము గలవాడయ్యాడు. అతడు యూదా రాజ్యమును ఇక పాలించలేకపోయాడు. దేవుని ప్రధాన దూతయైన లూసిఫరు గర్విష్ఠుడై తన స్థానాన్ని కోల్పోయి భూమిపై పడద్రోయ బడ్డాడు. నీవు నైతిక జీవితంలో ఎంత సాధించినను, అహంకార దృష్టి నిన్ను ఇట్టే పడద్రోయ గలదు.

కల్లలాడు నాలుక : దేవుడు యథార్థవంతుడు; ఆయనే సత్యము గనుక అబద్ధములాడు నాలుకను ఆయన అసహ్యించు కొంటాడు. అబద్ధములాడు వారందరు అపవాది సంబంధులు. కొందరు యూదులతో యేసుప్రభువు ఇట్లన్నాడు : "మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు, మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడు" (యోహాను 8 : 44).

నాలుకను దుర్వినియోగ పరచుటవలన కలిగే ప్రమాదమును గూర్చి యాకోబు తన పత్రికలో హెచ్చరించాడు (యాకోబు 3:3-15). మన మాటలనుబట్టియే అంత్యదినమందు మనకు తీర్పు జరుగునని యేసుప్రభువు చెప్పాడు. కొందరు తమ క్రియల ద్వారా ప్రజలను మోసగిస్తారు. అట్టివారు నిశ్చయంగా తమ ఫలమును పొందుదురు. అననీయ సప్పీరాలను దంపతులు ప్రభువుకు వారు సమర్పించు కొనిన దానిలో కొంత దాచుకొని అపొస్తలుల యొద్ద అబద్ధమాడారు. ...ను పేతురు - అననీయా నీ భూమి వెలలో కొంత దాచుకొని

పరిశుద్ధాత్మను మోస పుచ్చుటకు సాతాను నీ హృదయమును ఎందుకు ప్రేరేపించెను ? ... నీవు మనుష్యులతో కాదు, దేవునితోనే అబద్ధ మాడితివని వానితో చెప్పెను." అబద్ధ మాడినందువలన అననీయ సప్పీరాలు తమ ప్రాణమును కోల్పోయారు (అపొ. కా. 5 : 1-11). అబద్ధము లాడువారిని యెహోవా అసహ్యించుకొంటాడు.

(సశేషము).

---

Regd. No. H/KD—45/KD.M.C.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................

..............................

..............................

..............................